# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
20-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 3

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD






## మహేశ్ గౌడ్ ను తొలగించాలనలేదు

ఆయన నాకు ఎన్ఎస్ యుఐ నుంచి సన్నిహితుడు

జగ్గారెడ్డి సామర్థ్యాన్ని మెచ్చుకున్నానంతే- మంత్రి కోమటిరెడ్డి

పీసీసీ అధ్యక్ష పదవికి సంబంధించి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీలో దుమారం రేపడంతో ఆయన వివరణ ఇచ్చుకున్నారు.మహేశ్ కుమార్ గౌడ్ ను పీసీసీ అధ్యక్ష పదవి నుంచి తొలగించాలని తాను అనలేదన్నారు.

2లో



ప్రభుత్వ విప్ లుగా

## అద్దంకి, బల్మూరి

శాసనమండలిలో విప్ లుగా నియామకం

- అసెంబ్లీలో విప్ లుగా వేముల వీరేశం,
- యెన్నం శ్రీనివాసరెడ్డి, విజయరమణారావుకు చాన్స్

తెలంగాణలో అసెంబ్లీ, శాసన మండలి సమావేశాలు వాడీవేడిగా సాగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.



## కోమటిరెడ్డి ఎక్కడ?

సినిమా అవార్డుల వేడుకకు హాజరుకాని సినిమాటోగ్రఫీ మంత్రి

- వైభవంగా గద్దర్ అవార్డుల ప్రదానోత్సవం
- అన్నీ తానైన ఉప ముఖ్యమంత్రి భట్టి
- గతేడాది వేడుకకూ వెంకటరెడ్డి గైర్హాజరు
- విధాన నిర్ణయాల్లో విభేదాలే కారణమా?
- మంత్రివర్గ ప్రక్షాళనలో శాఖ మారే అవకాశం



2లో

తెలుగు సినిమా కళాకారులకు, సాంకేతిక నిపుణులకు తెలంగాణ ప్రభుత్వం గద్దర్ పేరిట నెలకొల్పిన అవార్డులను ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రదానం చేసింది. అయితే సినిమాలకు సంబంధించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మరోసారి గైర్హాజరయ్యారు. అవార్డుల ఎంపిక కమిటీ ఏర్పాటు దగ్గర్నుంచి అందజేత దాకా ఆయన దూరంగానే ఉన్నారు. దీంతో సినిమా పరిశ్రమకు సంబంధించిన విషయాల్లో ప్రభుత్వ పెద్దల మధ్య విభేదాలు వచ్చాయా? అన్న చర్చ జరుగుతోంది.



క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

ఉమ్మడి రాష్ట్రంలో సినిమాలకు నంది అవార్డుల పేరిట ఇచ్చిన పురస్కారాలను తెలంగాణ ప్రభుత్వం గతేడాది నుంచి తిరిగి అందజేస్తున్న విషయం తెలిసిందే. ప్రజా గాయకుడు గద్దర్ పేరిట నెలకొల్పిన ఈ అవార్డులను 2025 సంవత్సరానికి సంబంధించి



## నేడు బడ్జెట్..

మధ్యాహ్నం 12 గంటలకు ప్రవేశపెట్టనున్న తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో కీలకమైన ఘట్టానికి ముహూర్తం కుదిరింది. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రేపు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో కీలకమైన

ఇంధన వనరులపై

## దాడులా?

తీవ్రంగా ఖండించిన భారత్

చర్చలు, దౌత్యమే మార్గం: మోదీ

యుద్ధ పరిణామాలపై ఆందోళన

ఒమన్, జోర్డాన్, ఫ్రాన్స్, మలేసియా అధినేతలతో సంభాషణ

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో కీలక ఇంధన వనరులపై దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. "ప్రపంచమంతటినీ ఎంతగానో కలతకు గురి చేసే అంశమిది.

7లో



## తెలంగాణ బిజెపిలో అప్పుడే మంత్రి పదవుల పంపకాలు!

ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించని కమలం

నేతల మధ్య విభేదాల పర్వం

ఎవరికి వారే యమునా తీరే అన్నట్టు వైనం



ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టు ఉంది తెలంగాణలో భారతీయ జనతా పార్టీ పరిస్థితి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమె అధికారంలోకి వస్తామని కలలు కంటోంది బిజెపి. అయితే అందులో తప్పులేదు కానీ.. అప్పుడే కొందరు నేతలు మంత్రి పదవులు పంచుకుంటున్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ఫలానా మంత్రిని నేనే అంటూ బాహాటంగా ప్రకటిస్తున్నారు. నిన్ననే అటువంటి ప్రకటన చేశారు

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:ఆర్మూరు ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి. ఏకంగా ఈ రాష్ట్రానికి తానే హోం శాఖ మంత్రి అవుతానని తేల్చి చెప్పారు. అయితే ఇది ప్రకటన మాత్రమే కాదు.. ఏకంగా మాజీ మంత్రి హరీష్ రావు వద్ద ఈ వ్యాఖ్యానాలు చేశారు.

**8 సీట్లకే పరిమితం..**


మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో 8 సీట్లలో విజయం సాధించింది భారతీయ జనతా పార్టీ. 117 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్న తెలంగాణలో కేవలం ఎనిమిది స్థానాలకే పరిమితం అయింది.

## రైతు నామ సంవత్సరం

ఈ లక్ష్య సాధన కోసం మా పాలన కొనసాగుతుంది

శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి

22న రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని వెల్లడి



2లో



మామ పదవికి అల్లుడు

## ఎసరు!

ఎంపీ డ్రగ్స్ తో పట్టుబడటంతో ఆత్మరక్షణలో టిడిపి

ప్రజల్లోకి బలంగా వెళ్తున్న వైసిపి

యనమల రామకృష్ణుడు కు పదవి లేనట్టే



మామ పదవికి అల్లుడు ఎసరు పెట్టారు. చివరి నిమిషంలో పదవి విషయంలో అడ్డంకి గా మారారు. కొద్ది రోజుల కిందట తెలంగాణలో డ్రగ్స్ కేసులో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పట్టుబడిన సంగతి తెలిసిందే. ఆయన రాజకీయ నేపథ్య కుటుంబం నుంచి వచ్చారు.

క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో

రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ ప్రముఖ కుటుంబాలతో ఆయనకు బంధుత్వం ఉంది.పైగా ఆయన తండ్రి పుట్ట సుధాకర్ యాదవ్ టీటీడీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. ప్రస్తుతం కడప జిల్లాలోని మైదకూరు ఎమ్మెల్యేగా కూడా ఉన్నారు. అటు అత్తింటి వారి తరుపున కూడా

2లో



## నా పోరాటం ముగ్గురిపైనే: కవిత

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి తెరలేపుతున్న జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, తన రాజకీయ అజెండాను స్పష్టం చేశారు. బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. తన పోరాటం ఎవరితోనో కాదని.. "డాడీ (కేసీఆర్), మోడీ (పీఎం నరేంద్ర మోడీ), చిన్నమోడీ (కేటీఆర్)" లపైనేనని ఆమె సంచలన ప్రకటన చేశారు.బీఆర్ఎస్ పార్టీతో

# మహేశ్ గౌడ్ ను తొలగించాలనలేదు

(మొదటి పేజీ తరువాయి)

తన మాటలను వక్రీకరించారని తెలిపారు. ఇటీవల సంగారెడ్డిలో కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి నిర్వహించిన రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగ్గారెడ్డి నిర్వహణ సామర్థ్యాన్ని మెచ్చుకున్నారు. జగ్గారెడ్డి పీసీసీ చీఫ్ అయితే కాంగ్రెస్ పార్టీకి వంద సీట్లు వస్తాయని అన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను పలువురు పార్టీ నేతలు తప్పుబట్టారు. ఇది ప్రస్తుతం పీసీసీ చీఫ్ పదవిలో ఉన్న మహేశ్ కుమార్ గౌడ్‌ను కించపరచడమే అవుతుందన్నారు. పైగా, కోమటిరెడ్డి వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పీసీసీ మార్పుపై ఊహాగానాలు మొదలయ్యాయి. దీంతో స్పందించిన మంత్రి కోమటిరెడ్డి, "మహేష్ కుమార్ గౌడ్ నాకు ఎన్ఎస్‌యూఐ రోజుల నుండి అత్యంత సన్నిహిత మిత్రుడు. ఆయన సారథ్యంలోనే గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించాం" అని తెలిపారు. మహేష్ కుమార్‌పై తాను ఎలాంటి వ్యతిరేక వ్యాఖ్యలు చేయలేదని, కొందరు కావాలనే తన మాటలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సంగారెడ్డిలో జగ్గారెడ్డి చేసిన జనసమీకరణ, కార్యక్రమ నిర్వహణ తీరు చూసి ముగ్ధుడనై, భవిష్యత్తులో ఆయనకు పీసీసీ అయ్యే అర్హత ఉందని మాత్రమే చెప్పానని తెలిపారు. ఇప్పుడున్న పీసీసీ అధ్యక్షుడిని తొలగించాలనే ఉద్దేశం తనకు ఏమాత్రం లేదని, జగ్గారెడ్డి పనితీరును మెచ్చుకోవడమే తన ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

# ప్రభుత్వ విప్ లుగా అద్దంకి, బల్మూరి

(మొదటి పేజీ తరువాయి)

అధికార పార్టీ ఎమ్మెల్సీలు ఎంతో కాలంగా ఉత్కంఠగా ఎదురుచూస్తున్న శాసన మండలి విప్ పదవులను భర్తీ చేసింది. మండలిలో ఇద్దరు ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్‌లను విప్ లుగా నియమించింది. మరోవైపు శాసనసభలోనూ మరో ముగ్గురు ఎమ్మెల్యేలకు విప్‌లుగా బాధ్యతలు అప్పగించింది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిలకు శాసనసభలో విప్ పదవులు దక్కాయి. ఈ నియామకాలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. శాసనసభలో ఏదైనా బిల్లుపై ఓటింగ్ జరిగినప్పుడు లేదా ముఖ్యమైన చర్చలు జరిగినప్పుడు అధికార పార్టీ ఎమ్మెల్యేలంతా హాజరయ్యేలా చూడటంలో విప్‌ల పాత్ర కీలకం. ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా ఎవరూ ఓటు వేయకుండా పార్టీ లైన్‌ను అమలు చేయడం వారి ప్రధాన బాధ్యత. బడ్జెట్ సమావేశాలు, ఇతర కీలక సెషన్ల నేపథ్యంలో ఈ నియామకాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. రాజకీయంగా అనుభవం ఉన్న నాయకులకు ఈ బాధ్యతలు అప్పగించడం ద్వారా సభలో ప్రభుత్వ పట్టును మరింత బలోపేతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. తాజా నియామకాలపై సదరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రికి, పార్టీ అధిష్టానానికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.



## మామ పదవికి అల్లుడు

# ఎసరు!

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయ నేపథ్యం ఉంది. ఆయన మామ టిడిపి సీనియర్ నేత యనమల రామకృష్ణుడు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేసిన నేత. ఇంకోవైపు ఆయన భార్య సైతం ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్నారు. ఇంకోవైపు తెలంగాణ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబంతో కూడా బంధుత్వం ఉంది. మహేష్ సోదరిని శ్రీనివాస్ యాదవ్ కుమారుడు రవికిరణ్ వివాహం చేసుకున్నాడు.

**యనమల బాధ అంతా ఇంతా కాదు..**

అయితే అన్నింటికీ మించి ఇప్పుడు ఈ వ్యవహారంతో ఎక్కువ బాధ పడుతోంది పిల్లలకు ఇచ్చిన మామ. ఎందుకంటే ఏపీ పొలిటికల్ సర్కిల్లో యనమల రామకృష్ణుడు ఇమేజ్ ఉంది. ఆయన చేయని పదవి అంటూ లేదు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి మంత్రి అయ్యారు. ఆ పార్టీ ప్రతిపక్షంలో ఉంటే పబ్లిక్ అడ్వైజరీ కమిటీ చైర్మన్గా వ్యవహరించారు. ఒకసారి అసెంబ్లీ స్పీకర్ గా కూడా పదవి చేపట్టారు. మొన్నటి వరకు ఎమ్మెల్సీగా ఉన్న ఆయన పదవీ విరమణ చేశారు. రాజ్యసభ పదవి కానీ.. గవర్నర్ పోస్ట్ కానీ ఇస్తారని ఆశతో ఉన్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఆయన అల్లుడు డ్రగ్స్ కేసులో పట్టుబడ్డారు.

### సీరియస్ అంశం..

ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రభావం చూపుతోంది ఈ డ్రగ్స్ కేసు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజల్లోకి ఈ అంశంపై బలంగా వెళ్తోంది. టిడిపి కూటమి ప్రభుత్వం ఆత్మరక్షణలో పడింది. చంద్రబాబు కూడా ఈ అంశంపై సీరియస్ గా ఉన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో యనమల రామకృష్ణుడుకు పదవి ఇస్తే విమర్శలు మరింత పెరిగే అవకాశం ఉంది. అందుకే యనమలకు మొండి చేయి చూపడం ఖాయమని టిడిపి వర్గాల్లో ప్రచారం ఉంది. ఒక విధంగా చెప్పాలంటే యనమలకు ఇది దురదృష్టమే. గౌరవప్రదమైన పదవీ విరమణ పొందాలని చూశారు యనమల. కానీ పరిస్థితి చూస్తే మాత్రం ఏమంత ఆశాజనకంగా లేదు. పదవి దక్కేలా పరిస్థితి కనిపించడం లేదు. మరి ఏం జరుగుతుందో చూడాలి.



# తెలంగాణ బిజెపిలో అప్పుడే మంత్రి పదవుల పంపకాలు!

(మొదటి పేజీ తరువాయి)

అవి కూడా గ్రేటర్ పరిధిలో.. హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో.. నగరాల పరిధిలో మాత్రమే విజయం సాధించింది. ఇప్పటికీ తెలంగాణలోని పల్లె ప్రాంతాల్లో విస్తరించలేకపోయింది బిజెపి. మొన్నటి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా మూడో స్థానంలో.. చాలా తక్కువ స్థానాలకే పరిమితం అయింది. అటువంటి పార్టీ 2028 ఎన్నికల్లో అధికారంలోకి వస్తుందంటే నిజంగా నమ్మశక్యం కాదు. పార్టీని గ్రామస్థాయికి విస్తరించాలన్న ప్రయత్నాలు జరగడం లేదు కానీ.. అధికారంలోకి వచ్చేస్తాం అంటూ నేతలు కలలుగంటున్నారు.

**ఎంపీలు గెలిచేసరికి..**

భారతీయ జనతా పార్టీలో ఈ రకం ధీమా రావడానికి కారణం మొన్నటి సార్వత్రిక ఎన్నికలు. మొత్తం 17 పార్లమెంట్ సీట్లకు గాను.. భారతీయ జనతా పార్టీకి 8 ఎంపీ సీట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీతో చేరి సమానంగా సీట్లను దక్కించుకుంది. దానినే బలంగా భావిస్తోంది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ బీజేపీకి పట్టు దొరకలేదు. చాలా జిల్లాల్లో ఆ పార్టీ ప్రభావం చాలా తక్కువ. ముందుగా దానిని అధిగమించే ప్రయత్నం చేయడం లేదు. అన్నిటికంటే ముఖ్యంగా పార్టీలో సీనియర్ నాయకుల మధ్య విభేదాలు తీవ్ర స్థాయిలో ఉన్నాయి. వాటిని సరిదిద్దితే కానీ ఆ పార్టీ గ్రౌండ్ లెవెల్ లో బలోపేతం కాదు. కానీ నేతలు మాత్రం తమ పార్టీ అధికారంలోకి వచ్చేస్తోందని ధీమాతో ఉన్నారు. నాకు హోం మంత్రి పదవి దక్కుతుందని ఒకరు.. డిప్యూటీ సీఎం ఇచ్చేస్తారని మరికొందరు ఇలా లేనిపోని కలలతో గడిపేస్తున్నారు. అయితే బిజెపి హై కమాండ్ సైతం తెలంగాణపై ఆశించిన స్థాయిలో దృష్టి పెట్టలేదని అర్థమవుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో?



# కోమటిరెడ్డి ఎక్కడ?

(మొదటి పేజీ తరువాయి)

విజేతలకు గురువారం ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రదానం చేశారు. అయితే సినీ పరిశ్రమకు చెందిన వారికి అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగితే.. సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గైర్హాజరయ్యారు. అంతేకాదు.. అవార్డుల వేడుకలో ఆయన పేరును కూడా ఎవరూ ప్రస్తావించలేదు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోపాటు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాత్రమే హాజరయ్యారు. కార్యక్రమం ఆసాంతం భట్టివిక్రమార్క ఆధ్వర్యంలోనే జరిగింది. ఫిల్మ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ (ఎఫ్ డీసీ) చైర్మన్ దిల్ రాజు పర్యవేక్షణలో నిర్వహించారు. పలు కేటగిరీల్లో అవార్డుకు ఎంపికైన వారితోపాటు కోలీవుడ్ నుంచి ఖుష్బూను, బాలీవుడ్ నుంచి మాధురీ దీక్షిత్ ను, రితేశ్ దేశ్ ముఖ్-జెనీలియా దంపతులను రప్పించారు. ఉత్తమ చిత్రం, ఉత్తమ నటీనటులు, ఉత్తమ సాంకేతిక నిపుణులతోపాటు ప్రత్యేక అవార్డులను సీనియర్లకు ఇవ్వడం ద్వారా వారందరినీ రప్పించ కార్యక్రమానికి గ్లామర్ వచ్చింది. అవార్డు అందుకునేందుకు చిరంజీవి, కమల్ హాసన్, జయసుధ వంటి సీనియర్లతోపాటు నాగచైతన్య, రష్మిక, అతిథులుగా నాగార్జున, రామ్ చరణ్ వంటి వారు వచ్చారు. శ్రేయా ఘోషాల్, దేవిశ్రీ ప్రసాద్ తో పాటలు పాడించడం వంటి కార్యక్రమాలతో వేడుక వైభవంగానే జరిగింది. విజేతలకు అవార్డు, ప్రశంసాపత్రంతోపాటు రూ.10 లక్షలు, రూ.5 లక్షలు, రూ.3 లక్షల చొప్పున నగదు బహుమతిని కూడా అందజేశారు.

**కోమటిరెడ్డి ప్రస్తావన కూడా లేకుండా..**

అవార్డుల వేడుకకు వచ్చిన వారంతా సహజంగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ప్రశంసల వర్షం కురిపించారు. డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్కనూ పొగిడారు. కానీ, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రస్తావన ఎవరూ తేలేదు. ఇప్పుడేకాదు.. అవార్డుల ఎంపికకు జ్యూరీని నియమించినప్పుడు కూడా ఆయన ప్రమేయం లేకుండా పోయింది. ఇందుకు సంబంధించిన వ్యవహారాలన్నింటినీ ఉప ముఖ్యమంత్రే స్వయంగా చూసుకున్నారు. చివరికి అవార్డుల ప్రదానం రోజైనా సంబంధిత శాఖ మంత్రి హాజరు కాకుండా పోతారా? అన్న అభిప్రాయం అందరిలోనూ ఉంది. కానీ, ఆయన మాత్రం దూరంగానే ఉండిపోయారు. గతేడాది పదేళ్లుగా పెండింగ్ లో ఉన్న అవార్డులను ఒకేసారి ప్రదానం చేసినప్పుడు కూడా వేడుకకు కోమటిరెడ్డి దూరంగానే ఉన్నారు. దీంతో సినిమాటోగ్రఫీ శాఖను ఆయన పర్యవేక్షిస్తున్నారా? లేదా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. భారీ బడ్జెట్ సినిమాలకు మొదటివారం టికెట్ ధరలు పెంచుకునే అవకాశమిచ్చే విషయంలో ప్రభుత్వ పెద్దల మధ్య విభేదాలు వచ్చాయన్న అనుమానాలున్నాయి. పుష్ప-2 సినిమాకు సంబంధించి హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్సులోని సంధ్య థియేటర్ కు ఆ సినిమా హీరో అల్లు అర్జున్ వెళ్లిన సందర్భంగా తొక్కిసలాట చోటుచేసుకోవడం తెలిసిందే. ఆ ఘటన నేపథ్యంలో.. ఇకపై ఎవరి సినిమాలకూ కెట్ రేట్లు పెంచుకునే అవకాశం ఇచ్చేది లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి అప్పట్లో అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. ఈ విషయాన్నే ఆ శాఖ మంత్రి కోమటిరెడ్డి కూడా వెల్లడించారు. కానీ, ఆ తరువాత విడుదలైన కొన్ని సినిమాలకు తిరిగి టికెట్ రేట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే ఈ విషయంపై సంబంధిత శాఖ మంత్రిగా కోమటిరెడ్డి సమాచారం కూడా లేకుండా పోయింది. దీంతో ఆయన అప్పటినుంచే సినీ పరిశ్రమ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో ప్రభుత్వంలో ఏం జరుగుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి త్వరలో మంత్రివర్గ ప్రక్షాళన చేసే యోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సినిమాటోగ్రఫీ శాఖను కోమటిరెడ్డి నుంచి తప్పించి మరొకరికి ఇస్తారన్న అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి.





# నేడు బడ్జెట్..

(మొదటి పేజీ తరువాయి)

ఘట్టానికి ముహూర్తం కుదిరింది. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నేడు వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో మధ్యాహ్నం 12 గంటలకు బడ్జెట్‌ను ప్రవేశ పెడుతారు. శాసన మండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలకు ఆరు గ్యారంటీల ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండోసారి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. నిరుడు మార్చి 19న రూ. 3.05 లక్షల కోట్లతో వార్షిక బడ్జెట్‌ను శాసన సభ ముందుంచిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఈసారి అంకెల గారడీలు చేస్తారా? అభివృద్ధి, సంక్షేమానికి భారీగా కేటాయిస్తారా? అనేది రేపు మధ్యాహ్నం లోపు తెలియనుంది.

# రైతు నామ సంవత్సరం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతును రాజు చేయడమే లక్ష్యంగా తమ పాలన కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. శ్రీ పరాభవ నామ సంవత్సరాన్ని రైతు నామ సంవత్సరంగా మారుస్తామని వెల్లడించారు. గురువారం రవీంద్రభారతిలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రభుత్వం ఘనంగా నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 70 శాతం కుటుంబాలు వ్యవసాయాధారితంగానే మనుగడ సాగిస్తున్నాయని చెప్పారు. ఈ దృష్ట్యా వ్యవసాయరంగ సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రూ. 2 లక్షల రుణమాఫీతో రైతులను రుణ విముక్తులను చేశామని.. రూ. 18 వేల కోట్లను రైతు భరోసా కోసం ఖర్చు చేశామని వివరించారు.

# నా పోరాటం ముగ్గురిపైనే: కవిత

(మొదటి పేజీ తరువాయి)

తనకు ఉన్న అంతర్గత విభేదాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తమకు అనుకూలంగా మార్చుకోవాలని చూస్తున్నట్టు కవిత మండిపడ్డారు. తన రాజకీయ ప్రయాణం స్వతంత్రంగా ఉంటుందని, ఎవరికీ అడ్వాంటేజ్‌గా మారబోనని ఆమె స్పష్టం చేశారు. "మంచి ముహూర్తం చూసుకుని పార్టీని ప్రారంభిస్తా.. అప్పుడే నా లక్ష్యాలను ప్రజల ముందు ఉంచుతాను" అని ఆమె అన్నారు.మరోవైపు, కొత్త పార్టీ రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు నేడు సానుకూల తీర్పునిచ్చింది. 'తెలంగాణ ప్రజా జాగృతి' (టీజీ) పేరుతో దాఖలైన దరఖాస్తుపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. దీంతో పార్టీ అధికారిక ప్రకటనకు ఉన్న సాంకేతిక అడ్డంకులు దాదాపు

# కోకాపేట విశాఖ శ్రీ శారదాపీఠంలోని శ్రీ రాజ శ్యామల అమ్మవారి దేవస్థానంలో ఘనంగా ఉగాది వేడుకలు

- విశాఖ శ్రీ శారదా పీఠం గంటల పంచాంగం ఆవిష్కరణ
- పంచాంగ శ్రవణం ద్వారా నూతన సంవత్సర ఫలితాల వివరణ
- రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి, దేశ శ్రేయస్సు కోసం మహాస్వామివారి ఆశీర్వచనాలు
- ఉగాది పచ్చడి, మహా ప్రసాదం భక్తులకు పంపిణీ
- పలువురు ప్రముఖులు, న్యాయమూర్తులు, రాజకీయ నాయకులు, కళాకారులు పాల్గొన్నారు





**గండిపేట(క్రైం మిర్రర్):** కోకాపేట విశాఖ శ్రీ శారదా పీఠంలోని శ్రీ రాజ శ్యామల అమ్మవారి దేవస్థానంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠం ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ శారదా చంద్ర మౌళీశ్వర ఆరాధనతో ఉగాది వేడుకలు ప్రారంభమయ్యాయి. అనంతరం గాయని నిత్య సంతోషిణి, బృందం సమర్పించిన భక్తి సంగీత విభావరి భక్తులకు ఆధ్యాత్మిక పరవశం అందించింది. తరువాత విశాఖ శారదా పీఠం గంటల పంచాంగాన్ని ఘనంగా ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణం కార్యక్రమంలో చిర్రావూరి విజయనాథ్ శర్మ నూతన సంవత్సర ఫలితాలను వివరించారు. అనంతరం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామివారు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా మహాస్వామి మాట్లాడుతూ విశాఖ శారదా పీఠంలో జరిగే ప్రతీ కార్యక్రమం రాష్ట్ర శ్రేయస్సు, దేశ క్షేమం కోసమే నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ నూతన సంవత్సరంలో రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని, తెలుగు ప్రజలు అత్యున్నత శిఖరాలకు ఎదగాలని ఆశీర్వదించారు. దేశ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, దేశ శ్రేయస్సే ముఖ్య ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తరువాత వేడుకలకు హాజరైన భక్తులకు ఉగాది పచ్చడి, మహా ప్రసాదం పంపిణీ చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు, సాంప్రదాయ విలువలను మరింత బలపరిచాయి. విశాఖ శ్రీ శారదా పీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాలు భక్తులకు నూతన సంవత్సరానికి ఆధ్యాత్మిక స్ఫూర్తిని అందించాయి. భక్తుల భారీ సంఖ్యలో పాల్గొనడంతో ఈ ఉత్సవాలు విజయవంతంగా ముగిశాయి. ఈ వేడుకల్లో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రవీణ్ కుమార్ , జస్టిస్ రామకృష్ణ రెడ్డి, పట్నా హైకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ ఎల్. నరసింహా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రక్షణ, వ్యూహాత్మక వ్యవహారాల సలహాదారు, నేషనల్ సెక్యూరిటీ బోర్డ్ మెంబర్, డీఆర్డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ జి. సతీష్ రెడ్డి, ఎన్సీఎల్టీ న్యాయ సభ్యుడు జస్టిస్ బద్రీనాథ్, మాజీ న్యాయమూర్తి మఠం వెంకటరమణ, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మురళీధర్ రావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే శ్రీ హరీష్ రావు, మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్, తెలంగాణ మాజీ డీజీపి అంజన్ కుమార్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ప్రసిద్ధ గజల్ గాయకుడు ఘజల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# బోరు వేశారు... పంపు మరిచారు

## పొన్నగుట్ట మల్లికార్జున స్వామి ఆలయంలో త్రాగునీరు సమస్య.

**క్రైమ్ మిర్రర్ పెగడపల్లి :** జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఎల్లాపూర్ గ్రామంలోని పొన్నగుట్ట మల్లికార్జున స్వామి ఆలయం వద్ద బోరు వేసి సంవత్సరం గడిచినా దానికి మోటర్ లేదు, పంపు లేదు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవతో బోర్వెల్ వేసి సంవత్సరం గడిచినా చేతి పంపుకు నోచుకోలేదు. దీనివల్ల పొన్నగుట్ట మల్లికార్జున స్వామి భక్తులు నీటి సౌకర్యం లేక చాలా ఇబ్బందులు పడుతున్నారు. త్రాగునీరు లేక మల్లన్న పట్నాలు కూడా ఆగిపోవడం జరిగింది. . ఈ సందర్భంగా నెల్లి మల్లేశం, ఎగుర్ల మల్లేశం మాట్లాడుతూ వెంటనే సహృదయంతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చొరవ తీసుకొని మోటర్ వేయించాలని పరిసర గ్రామాల ప్రజలు ప్రజలు కోరుకుంటున్నారు.

# మాతృదేవోభవ అనాధాశ్రమంలో ఉగాది వేడుకలు



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** నాదర్గుల్లోని మాతృదేవోభవ అనాథ ఆశ్రమంలో ఉగాది సంబరాలు ఘనంగా జరుపుకోవడం జరిగింది. మానసిక వికలాంగులు, మతిస్థిమితం లేని అభాగ్యులకు ఎవరు లేని లోటు తీర్చాలని ఒక ముఖ్య ఉద్దేశంతో ఆశ్రమం వ్యవస్థాపకులు గట్టు గిరి మరియు కుటుంబ సభ్యులు ప్రతి పండుగ లాగానే ఈ ఉగాదికి కూడా ఆ అభాగ్యుల ముఖంలో ఆనందం చూడాలని ఒక గొప్ప సంకల్పంతో అందరి సమక్షంలో ఉగాది పచ్చడి ఆరు రుచులతో అందరికీ అందించి వారి ముఖంలో ఆనందం చూడడం చాలా సంతోషంగా ఉందని, ఈ ఉగాది పండుగ సందర్భంగా ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలని మాతృదేవోభవన తరపున కోరుతున్నానని గట్టు గిరి తెలిపారు.

# మాడుగుల బాపుశర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం


## పాల్గొన్న వందలాది మంది భక్తులు



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరం ముక్తీశ్వర అనుబంధ దేవాలయం అయినా వీరాంజనేయస్వామి దేవాలయంలో ఉగాది పర్వాదినాన్ని పురస్కరించుకొని అర్చకులు మాడుగుల బాపుశర్మ పవన్ శర్మ ఆధ్వర్యంలో రామగుండం లక్ష్మీనారాయణ శర్మ గారిచే పంచాంగ శ్రవణం జరిపించడం జరిగింది ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో దీక్షస్వాములు భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా అర్చకులు నూతన సంవత్సర రాశిఫలాలు, ఆదాయ-వ్యయాలు, మరియు రాజ్యపూజ్యాలను భక్తులకు చదివి వినిపించారు. అనంతరం పంచాంగ శ్రవణం లో పాల్గొన్న భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# ఉప్పర్‌పల్లి శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో పంచాంగ పఠనం

గండిపేట(క్రైం మిర్రర్): ఉప్పర్‌పల్లిలో గురువారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఆనవాయితీగీ పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులందరు కలిసి శ్రీ శివాంజనేయ స్వామి దేవాలయంలో పండితులు కృష్ణప్రసాద్ శర్మ చేత పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దలు, ప్రముఖులు పాల్గొన్నారు.






# ఉగాది ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, కొత్త ఆకాంక్షలు నింపాలి : మాజీ కౌన్సిలర్ ఉషారాణి

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్ ఉషారాణి ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ ఉగాది ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త ఆశలు, కొత్త ఆకాంక్షలు నింపాలని ఆకాంక్షించారు. మీకు, మీ కుటుంబ సభ్యులకు అపారమైన ఆనందం, విజయాలు, ఆరోగ్యకరమైన జీవితం కలగాలని కోరుకుంటూ, సమాజం సుఖశాంతులతో అభివృద్ధి చెందాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరాన్ని సానుకూల దృక్పథంతో స్వాగతిస్తూ, ప్రతి ఇంటా సంతోషం, సంపదలు వెల్లివిరియాలని కోరుతూ శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

# నార్సింగి సర్కిల్‌లో ఉగాది పంచాంగ శ్రవణం నిర్వహణ

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మంచిరేవుల గ్రామంలోని హనుమాన్ మందిరంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాంగ శ్రవణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు సంప్రదాయ పద్ధతిలో నూతన సంవత్సర ఫలితాలను వివరిస్తూ పంచాంగాన్ని వినిపించారు. పూజలు నిర్వహించి, నూతన సంవత్సరాన్ని శుభప్రదంగా ఆరంభించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మణికొండలో శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రిక



**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 27న శ్రీ సీతారామనవమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ నెల 27వ తేదీన శుక్రవారం అల్కాపూర్ రోడ్ నెంబర్ 25 మహాత్మా గాంధీ పార్క్‌లో శ్రీ రామానవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం పురస్కరించుకోని గురువారం వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఓలం యాదగిరి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మణికొండ వాసులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

# వర్ధమానుకోట ఏకాంబరేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

## ఉగాది పురస్కరించుకొని ఆరాధ్య ఫౌండేషన్ విశేష పూజలు



**సూర్యాపేట(క్రైమ్ మిర్రర్):** జిల్లాలోని నాగారం మండలం, వర్ధమానుకోట గ్రామం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లింది. తెలుగు నూతన సంవత్సరాది శ్రీ పరాభవ నామ, ఉగాది పండుగను పురస్కరించుకొని గ్రామంలోని చారిత్రక శ్రీ ఏకాంబరేశ్వర స్వామి దేవస్థానంలో, అత్యంత వైభవంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆరాధ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, తాడోజు వాణి శ్రీకాంత్ రాజు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం, స్వామివారికి అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించగా, ఫౌండేషన్ ప్రతినిధులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ?ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన, పంచాంగ శ్రవణ కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కొత్త సంవత్సరంలో గ్రహగతులు, వర్షపాతం, రాశి ఫలాల వివరాలను పండితులు వివరించారు. ఈ కార్యక్రమంలో వర్ధమానుకోటతో పాటు, చుట్టుపక్కల గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఆరాధ్య ఫౌండేషన్ బృందం సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఫౌండేషన్ సభ్యులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. లోక కల్యాణం కోసం, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఈ పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

# శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో ఉగాది వేడుకలు

## ఉగాది అందరి జీవితాలలో వెలుగులు నింపాలి...

## మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్



**చౌటుప్పల్,మార్చి 19, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో గురువారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చౌటుప్పల్ మున్సిపల్ చైర్పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ఆవరణలో బ్రాహ్మణోత్తములు పెద్ది సుధాకర్ శర్మ, పెద్ది కిషోర్ శర్మ లచే పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాశి ఫలాల ఆధారంగా ఆదాయ,వ్యయ, రాజపూజ్యం,అవమానం వంటి వివరాలను వెల్లడించారు. ఈ సంవత్సరం వర్షాలు సమృద్ధిగా పడతాయని , దేశంలోని రైతులు వృద్ధి సాధిస్తారని వేద పండితులు తెలిపారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి, భక్షాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుర చైర్ పర్సన్ మాట్లాడుతూ... ఈ ఉగాది పర్వదినం అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ పుర ప్రజలకు నూతన తెలుగు సంవత్సరాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, దేవాలయ కమిటీ చైర్మన్ బొబ్బిలం మురళి, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, ధర్మకర్తలు కామిశెట్టి చంద్రశేఖర్, గుర్రం వెంకటేష్ వరకల వెన్నెల రవి గౌడ్, తూర్పాటి నరసింహ, చౌటుప్పల్ పురపాలక కౌన్సిలర్లు బత్తుల వాణి విప్లవ గౌడ్, దీప రమ్యరాజు, ఉడుగు జ్యోతి రమేష్ గౌడ్, చింతల ఉమామహేశ్వరి సాయిలు, బత్తుల జయలక్ష్మి దాసు గౌడ్, మంచి కంటికి భాస్కర్ గుప్తా, బుడిగే బాలకృష్ణ గౌడ్ దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, ఉడుగు మల్లేష్ గౌడ్ చింతల తిరుమలరెడ్డి, బొబ్బిళ్ళ రాజేందర్, చెరుకు లింగస్వామి గౌడ్, గోశిక రవి, గంగరాములు, చెవ్వగొనివెంకటేష్ గౌడ్, జక్కర్తి శేఖర్, పెద్దగోని రమేష్ గౌడ్, ముద్దం సత్తయ్య గౌడ,కర్నాటి శ్యామ్, ఉప్పల కృష్ణ గుప్తా, సంగమేశ్వర్, రాజేష్ గౌడ్, ఒరగంటి మహేందర్ గౌడ్, మునుకుంట్ల జంగయ్య గౌడ్, వీరమల్ల యాదయ్య గౌడ్, ఆంజనేయ చారి పాల్గొన్నారు.



## 6 వార్డ్ అభివృద్ధి కి నిరంతరం పాటుపడుతా కౌన్సిలర్ ఉషాకిరణ్ విజయ్

### ఇందిరమ్మ ఇల్లు నీరు పేదలకు అందేలా చూడాలి సొసైటీ మాజీ చేర్మెన్ బద్దం శశిధర్ రెడ్డి

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలో ని చిన్న శంకర్ పల్లి 6 వార్డ్ కౌన్సిలర్ ఉషాకిరణ్ విజయ్ ఇందిరమ్మ ఇల్లు మాజీ సొసైటీ చేర్మెన్ బద్దం శశిధర్ రెడ్డి తొ కలిసి ప్రారంభించారు, ఈసందర్భంగా మాట్లాడుతు ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలకు ఒక వరం అని అన్నారు,ఈసందర్భంగా మాట్లాడుతూ చిన్న శంకర్ పల్లి 6వార్డ్ లో మౌలిక సదుపాయల కల్పనకు మొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు,

## శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది వేడుకలు

### ఉగాది అందరి జీవితాలలో విజయాలు చేకూర్చాలి...

### 18 వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్



**చౌటుప్పల్,మార్చి19, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ 18 వ వార్డు హనుమాన్ నగర్ లో శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది పర్వదిన వేడుకలను గురువారం దేవాలయ కమిటీ సభ్యులచే ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు ఉగాది పచ్చడిని అందజేశారు. దేవాలయం లో సౌండ్ స్పీకర్ దాతగా నిలిచిన వంగాల రమాకాంత్, కాసోజు గోపి లను ఘనంగా సన్మానించి పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ మాట్లాడుతూ... పుర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉగాది అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, కొత్త ఆశలు,విజయాలు చేకూరాలని కోరారు. ఈ ఏడాది అందరికీ శుభప్రదంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ గౌరవ అధ్యక్షులు భీమిడి మోహన్ రెడ్డి, ప్రస్తుత అధ్యక్షులు కాసోజీ యాదయ్య చారి, 18 వ వార్డు కౌన్సిలర్ బుడ్డ సురేష్ , నరసింహ చారి, కంచర్ల గోవర్ధన్ రెడ్డి, కమిటీ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

## దుండిగల్ డబల్ బెడ్ రూమ్ కాలనీలో ఎంపీ లాడ్స్ నిధులతో బోర్లు ప్రారంభం

### స్థానిక ప్రజల హర్షం... ఈటల రాజేందర్ చిత్రపటానికి పాలాభిషేకం



**కుత్బుల్లాపూర్, మార్చి 19 (క్రైమ్ మిర్రర్) :** దుండిగల్ సర్కిల్లో డబుల్ బెడ్రూమ్ వాసులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను బీజేపీ పార్టీ నాయకులు మేడ్చల్--మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. దీనిపై స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ ప్రజల సమస్యల పట్ల చలించి తన పార్లమెంట్ పరిధిలో ఎక్కడెక్కడ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఉన్నాయో అక్కడి సమస్యలను వెంటనే గుర్తించి పరిష్కారం చూపించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో ఎంపీ నిధుల ద్వారా దుండిగల్ డబుల్ బెడ్రూమ్ సముదాయంలో రూ. 36 లక్షల వ్యయంతో బోర్లు మంజూరు చేయించి, వాటి ప్రారంభం జరగడం పట్ల స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దుండిగల్ డబుల్ బెడ్రూమ్ వాసులు ఎంపీ ఈటల రాజేందర్ చిత్రపటానికి పాలు అభిషేకం నిర్వహించి తమ కృతజ్ఞతను తెలిపారు. తమ కోసం ఎల్లప్పుడూ ముందుండి నిలబడిన బీజేపీ పార్టీ దుండిగల్ మున్సిపాలిటీ కార్యదర్శి తలారి రాజ్కుమార్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొని బోర్లు వేయించడంలో ప్రత్యేక చొరవ చూపిన రాజ్కుమార్ కి ఎప్పటికీ తమ మద్దతు ఉంటుందని తెలిపారు. అలాగే ఎంపీ ఈటల రాజేందర్ కి జన్మదినం సందర్భంగా ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సువర్ణ, నాగ పుష్ప, శోభ, రహీం, భాగ్యలక్ష్మి, దుర్గా ప్రసాద్, శ్రీను కలని వాసులు తదితరులు పాల్గొన్నారు.

## యరుగండ్లపల్లిలో ఘనంగా ఉగాది వేడుకలు

### హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు..సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్



**మర్రిగూడ(క్రైమ్ మిర్రర్):** పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగను పురస్కరించుకొని, యరుగండ్లపల్లి గ్రామంలో ఉగాది వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. సర్పంచ్ తో కలిసి, గ్రామ ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**ప్రజలు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి..సర్పంచ్ సంతోష్ యాదవ్**

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ కొత్త ఏడాదిలో గ్రామస్తులందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోశాలతో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామం అభివృద్ధి పథంలో పయనించాలని, పాడిపంటలతో గ్రామం వర్ధిల్లాలని ఆయన భగవంతుడిని కోరుకున్నారు. అనంతరం గ్రామ కోటమైసమ్మ తల్లి ప్రాంగణంలో, పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పురోహితులు మంచన హరిబాబు శర్మ, మణి శర్మ గారు ఈ ఏడాది రాశి ఫలాలు, వర్ష సూచనలు మరియు గ్రహగతులను భక్తులకు వివరించారు. గ్రామమంతా పచ్చని తోరణాలు, ఆధ్యాత్మిక మత్రోచ్ఛారణలతో ఉగాది శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగన్ గ్రామ ఉపసర్పంచ్ చామకూర క్రిష్ణమ్మ , వార్డు సభ్యులు, ?మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్కాపూర్ ఎంజీ పార్క్‌లో ఉగాది వేడుకలు



**గండిపేట(క్రైం మిర్రర్):** అల్కాపూర్ ఎంజీ పార్క్‌లో ఉగాది పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రావణం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పండితులు బ్రహ్మశ్రీ కొరిడే గణేష్‌శర్మ హజరై నూతన సంవత్సరానికి సంబంధించిన పంచాంగ విశేషాలను, గ్రహిస్థితులను వివరించి ప్రజల జీవితాల్లో శుభఫలితాలు కలగాలని ఆశీర్వాదించారు. ఈ సందర్భంగా ఏజీఎం ప్రెసిడెంట్ జితేందర్ మెరుగు మాట్లాడుతూ ఉగాది కొత్త ఆరాంభాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం, యువత భవిష్యత్తు కోసం అందరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి జయప్రకాష్, రాజు, శ్రీనివాస్ బాలాగోని, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, జితేందర్‌రావు, ప్రకాష్‌రెడ్డి, శ్రీధర్ చాకిలం, కిషన్‌రావు, కృష్ణారెడ్డి, సంతోష్, పెద్దలు, మహిళలు, యువత తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల దాహార్తిని తీర్చేందుకు.. ఎల్‌ఏ చిట్ ఫండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**బాలానగర్, మార్చి 19 (క్రైమ్ మిర్రర్) :** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ప్రారంభించడం అభినందనీయమని తెలంగాణ సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షుడు రాంచందర్ పేర్కొన్నారు. మండల కేంద్రమైన బాలానగర్ పరధిలోని వినాయకనగర్ ఎల్‌ఏ చిట్ ఫండ్స్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసినా చలివెంద్రాణి గురువారం అయన ప్రారంభించారు. ఈ సందర్బంగా రాంచందర్ మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవ అని భావించి ఎల్‌ఏ చిట్ ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం చలివేంద్రాన్ని నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. వినాయకనగర్ ప్రధాన రహదారిపై ఉన్న చలివేంద్రం వల్ల ప్రయాణీకులు, బాటసారుల దాహార్తిని మండు వేసవిలో తీర్చడమనే సేవా కార్యక్రమం చేపట్టడం మహోన్నతమైన విషయమని కొనియాడారు. ఇలాంటి సేవాకార్యక్రమాలను మరిన్ని చేయడానికి పులి శివ కుమార్ గౌడ్ మిత్రమండలి ముందుకు రావాలని అయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దశ్రాథ్ గౌడ్, రవి ముదిరాజ్, వెంకటేష్ గౌడ్, సదా గౌడ్, పులి శ్రీకాంత్ గౌడ్, పద్మావతి, దాండు రవి గౌడ్, కుమార్, శ్యామ్, రాజేందర్, రాము, విగ్నేష్ ఇతరులు పాల్గొన్నారు.

## పండుగ పూట విషాదం.. చెరువులో పడి వ్యక్తి మృతి





**నూతనకల్ ( క్రైమ్ మిర్రర్):** ఉగాది పండుగ సందర్భంగా తన పశువులను నీటితో కడగటం కోసం కుంటలోకి వెల్లి ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పెదనెమిల గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం పెదనేమిల గ్రామ పరిధిలోని ముత్యాలమ్మ కుంటకు నాగేల్లి రామస్వామి(60) తన ఎద్దులను శుభ్రం చేయడానికి కుంటకు వెళ్లాడు. ఎద్దులను నీటితో శుభ్రం చేసిన అనంతరం తన వద్ద ఉన్న ముళ్ళు కర్ర నీటిలో తెలియాడగా, నీటిలోని కర్రను అందుకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు లోతైన కుంటలో పడి మృతి చెంది నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు బంధువులకు పోలీసు వారికి సమాచారం అందించగా ఎస్ఐ నాగరాజు తన సిబ్బంది తో సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. 5 గంటల పాటు శ్రమించి చెరువులోకి దిగి ఫైర్ సిబ్బంది,గజ ఈతగాళ్ల, స్థానిక ప్రజల సహాయంతో మృతదేహాన్ని వెలికి తీసి కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

# తక్కళ్ల జయశ్రీ రజకపై దాడి ...

## పోలీసులకు ఫిర్యాదు... కేసు నమోదు

### ఎప్పటికప్పుడు ఫోన్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్న రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక

### ఆసిఫాబాద్ రజక సంఘ విజయం రాష్ట్ర రజకులకు ఒక స్ఫూర్తి

**ఆసిఫాబాద్, మార్చి 19(క్రైమ్ మిర్రర్):** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా ఆసిఫాబాద్ పట్టణ కేంద్రంలో రజక కులానికి చెందిన కలావతి, తక్కళ్ల జయశ్రీ రజక భర్త హరీష్ కసాబ్వాడిలో నివాసం ఉంటూ కాలనీలో ఉండే పోచమ్మ తల్లి ఆలయాన్ని నిత్యం శుభ్రపరుస్తూ ఉండేది . దినచర్యగా మంగళవారం ఆలయాన్ని శుభ్రపరిచే క్రమంలో అక్కడే నివాసం ఉండే కాపు సామాజిక వర్గానికి చెందిన జయశ్రీ - శ్రీనివాస్ , పవన్ ఆలయానికి పూజ చేయడానికి వచ్చి శుభ్రపరిచే రజక కులస్తురాలైన తక్కళ్ల కలావతి,తక్కళ్ల జయశ్రీని అసభ్య పదజాలంతో దూషిస్తూ అవమానించడమే కాకుండా ఊడ్చే చీపురుతో కుడి కాలిపై కొట్టి గాయపరిచింది అక్కడితో ఆగకుండా కాపు పవన్ అనే వ్యక్తి పిప్పిరి శిరీషల కాలర్ పట్టుకుని దురుసుగా ప్రవర్తించి కులం పేరుతో అవమానించడమే కాకుండా వారిపై చెప్పులు విసిరి అవమానించిన విషయం వేములవాడ రాజేష్, కొండ్ర రాజేందర్ ద్వారా దాడి జరిగిన రాత్రి 11 గం.లకు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక కు తెలియజేయగా అన్ని విధాలుగా ఆసిఫాబాద్ రజక సంఘానికి అండగా ఉంటామని గోపి రజక హామీ ఇచ్చారు. నిందితురాలు



కాపు జయశ్రీ - శ్రీనివాస్ ,పవన్ లపై కేసు పెట్టాలని బుధవారం ఆసిఫాబాద్ రజక కుల సంఘం బంద్ కు పిలుపిచ్చి పోలీసు స్టేషన్ కు ర్యాలీగా చేరుకొని నిందితులపై కేసు నమోదు చేయాలని కోరగా సీఐ పి.బాలాజీ సంఘటన స్థలానికి వెళ్లి విచారించి వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడం జరిగింది.

కలిసికట్టుగా పోరాటం చేయడం చేత నిందితులపై కేసు నమోదు చేయగలిగారు కాబట్టి రాష్ట్ర వ్యాప్తంగా రజక కులస్తులు ఐక్యమత్యంగా ఉండాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక కులస్తులను కోరారు.



ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బిజెపి రాష్ట్ర కో-ఆపరేటివ్ సెల్ కన్వీనర్ కొలను శంకర్ రెడ్డి భారత జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రామచంద్ర రావు ని కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది

(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)

## కాషాయ జెండా రెప రెప కోసం జీవితాన్ని ప్రాణాలను అర్పించిన శివాజీ, శంభాజీ మహారాజులను గుర్తు చేసేది ఈ జెండా

### శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** పరాభవ నామ సంవత్సరం ఉగాది పండుగను ప్రతీ హిందువు ఇంట్లో చేసుకున్నట్లుగానే తమ ఇండ్లపై కూడా కాషాయ జెండాలను ఎగురవేయాలని శంకర్ పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్.నరేష్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం ఉగాది పండుగ సందర్భంగా విలేకరులతో నరేష్ మాట్లాడుతూ కాషాయం అంటేనే సనాతనం, హిందూ హైదవ జాతి అని పేర్కొన్నారు. కాషాయం ఎరపు రంగును చూస్తుంటేనే ఒక ధైర్యం ఒక ఉత్సాహం ఒక శక్తి ఉప్పొంగుతుందని, ఆనాటి త్యాగధనుల చరిత్రను కండ్ల ముందు ఉంచుతుందన్నారు. మొఘలుల దుర్మార్గాన్ని, అరాచకాన్ని దోపిడీని అప్పట్లో శివాజీ, శంభాజీ మహారాజులు ఎదుర్కొని ఉండక పోతే భారత దేశంలో హిందూ ధర్మం ఆపదలో పడేదని తెలిపారు. కాబట్టి నేటి యువతీ యువకులు శివాజీ, శంభాజీ లా, జీజియా భాయి లా తమ పిల్లలకు దేశ, దైవ భక్తి, క్రమ శిక్షణను, సనాతన ధర్మం విలువలను నూరిపోయాలని ఆయన పిలుపునిచ్చారు.



# నేరవేరిన సొంతింటి కల...

### పేద కుటుంబాల్లో పండుగ సంబరాలు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** ఏళ్ల తరబడి ఎదురుచూసిన పేదల సొంతింటి కలను నిజం చేస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రజలల్లో ఆనందపు వెలుగులు నింపుతోంది. చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామం, గుండ్రాంపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న గౌరవ నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పేదలకు గౌరవప్రదమైన జీవనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన గృహ నిర్మాణ కార్యక్రమం సామాజిక సమానత్వానికి, అభివృద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సొంతింటి కళ నెరవేరుతున్న లబ్ధిదారుల ముఖాల్లో కనిపించిన ఆనందం ఈ పథకం విజయాన్ని స్పష్టంగా తెలియజేస్తోందన్నారు. పండుగ వాతావరణంలో నిర్వహించిన ఈ గృహప్రవేశాలు పేద ప్రజల్లో నూతన ఆశలు నింపగా, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, చిట్యాల మున్సిపల్ చైర్మన్ పందిరి గీతా రమేష్ పెద్ద కాపర్తి సర్పంచ్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం ఉప సర్పంచ్ ఓర్సు సైదులు వార్డు సభ్యులు యాదయ్య ఆనగంటి పూజా నరేష్ ఏర్పుల మల్లీశ్వరి వెంకటేశం గంటల తిరుమల్ రెడ్డి ఏర్పుల



నరసింహా సాగర్ల నాగరాజు గారు పార్టీ నాయకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులను అందజేసిన టిపిసిసి ఉపాధ్యక్షుడు బండి రమేష్

**కూకట్ పల్లి, మార్చి 19 (క్రైమ్ మిర్రర్) :** రంజాన్ పండుగ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ గౌతమ్ నగర్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు వినయ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం సుమారు 200 మంది ముస్లింల మహిళలకు పెద్ద ఎత్తున నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై సరుకులను పంపిణీ చేశారు. ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు అభినందనలు తెలియజేశారు. పెద్ద ఎత్తున ఆహార వస్తువులను ముస్లింలకు అందజేసిన వినయ్ ముదిరాజును రమేష్ ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, కుక్కల రమేష్, అహ్మద్ ఖాన్, వినయ్, అరుణ్, నరేందర్, శ్రావణ్, జ్యోతి, శారద, నరసింహ, వరహాల స్వామి, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలలో పాల్గొన్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, మార్చి 19(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ పరాభవ నామ సంవత్సర ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.. ఈ కార్యక్రమానికి సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి హాజరై ఆలయములో ప్రత్యేక పూజలు నిర్వహించారు..ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు..ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ పంతులు, హరి పంతులు పంచాంగం చదివి వినిపించారు..భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు..,ఈ పూజ కార్యక్రమం రామలింగేశ్వర స్వామి దేవాలయ అధ్యక్షుడు వడ్డేపల్లి రాములు సాగర్, కాంగ్రెస్ పార్టీ




గ్రామ శాఖ అధ్యక్షులు జక్కిడి చంద్రారెడ్డి, వార్డు నెంబర్లు, మందుగుల బాలకృష్ణ, పందుల యాదగిరి గౌడ్, బల్గురి శివ, చిలువేరు రమాదేవి శంకర్, కట్ల వనజ భాస్కర చారి, కమిటీ సభ్యులు, గ్రామస్తులు మోగుదాల సత్తయ్య గౌడ్, పాలకూర గిరి గౌడ్, సతీష్ గౌడ్, ఉప్పల రాజయ్య, జక్కల యాదయ్య, చిలువేరు అంజయ్య, ఉప్పల కృష్ణ, నీళ్ల ముత్యాలు, యాదయ్య,



సూర రాజయ్య, క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, కరోబార్ పున్నం యాదగిరి గునిగంటి రాజు గౌడ్, బద్దుల మురళి యాదవ్, మారగోని శంకర్ గౌడ్, ఎర్రోళ్ల లింగస్వామి, బానోతు కిరణ్, రెవన పెల్లి గోపాల్, రిపోర్టర్ సింగం కృష్ణ, పెద్దగోనిగిరి గౌడ్, కాశీశెట్టి ప్రవీణ్ గుజ్జుల మునయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు ప్రవీణ్ పాల్గొన్నారు.

## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

### సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

## ఇందారంలో రంజాన్ తోఫా పంపిణీ చేసిన మంత్రి వివేక్




**మంచిర్యాల మార్చి 19 (క్రైమ్ మిర్రర్) :** ముస్లిం మైనారిటీల సంక్షేమానికి, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలో గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ఆయన ముస్లిం సోదర,సోదరీమణులకు 'రంజాన్ తోఫా' పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మసీదు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన వాటర్ షెడ్డును మంత్రి ప్రారంభించారు. అనంతరం ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ ఇందారం గ్రామాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో తనకు అధికారం లేకపోయినా, విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గ్రామంలో 36 బోర్ వెల్స్ వేయించామని గుర్తుచేశారు. తాజాగా గ్రామస్తులు కోరిన మరో బోర్ వెల్ మంజూరు చేస్తానని ప్రకటించారు. చెన్నూరు నియోజకవర్గంలో సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, ముస్లింల కోసం చెన్నూరులో రూ. 50 లక్షలతో షాదీఖానా నిర్మిస్తున్నామని తెలిపారు. జైపూర్‌లో త్వరలోనే 3ఇ800 మెగావాట్ల పవర్ ప్లాంట్‌ను ప్రారంభించబోతున్నామని, దీనివల్ల స్థానిక యువతకు భారీగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఆర్కె-5 లో కొత్తగా ఓపెన్ కాస్ట్ మైన్ రాబోతుందని వెల్లడించారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 250 కోట్లతో సోమనపల్లిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులు ప్రారంభించామని, విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు,ముస్లిం సోదరులు పాల్గొన్నారు

## ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్ పర్సన్ గా బచ్చలకూరి నాగరాజు



**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది.. నేలకొండపల్లి మండలం కోరట్లగూడెం గ్రామానికి చెందిన బచ్చలకూరి నాగరాజు ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ స్పోక్ పర్సన్ గా నియమించారు.. కాంగ్రెస్ పార్టీ పది సంవత్సరాల ప్రతి పక్షంలో బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎన్నో పోరాటాల చేస్తూ, కాంగ్రెస్ పార్టీ అధికారమే లక్ష్యంగా పెట్టుకునే ఎన్నో పోరాటాల చేశారు.. విశేష కృషిని గుర్తించి టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ గారు ఈరోజు ఉత్తర్వులు జారీ చేశారు..


# ఇంధన వనరులపై దాడులా?

ఇప్పటికే ఒడిదొడుకుల్లో ఉన్న అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌ను ఈ దాడులు మరింతగా దెబ్బ తీస్తాయి"అంటూ ఆందోళన వెలిబుచ్చింది. ఇరాన్‌లోని సౌత్ పార్స్ చమురు క్షేత్రాలపై ఇజ్రాయెల్ దాడి, ప్రతీకారంగా ఖతర్‌లోని ఎల్ఎన్‌జీ క్షేత్రం రస్ లఫాన్‌తో పాటు సౌదీ అరేబియాలో అతి పెద్ద చమురు క్షేత్రమైన ఆరాంకోపైనా ఇరాన్ దాడులు కలకలం రేపడం తెలిసిందే. ఇవి భారత్‌ను తీవ్రంగా కలచివేసినట్టు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. పౌర సదుపాయాలు, ఇంధన వనరులపై దాడులు కూడదని భారత్ ముందునుంచీ చెబుతూనే వస్తోందని గుర్తు చేశారు. వాటికి తక్షణం తెర దించాలని గురువారం మీడియా సమావేశంలో ఆయన సూచించారు. భారత ఎల్ఎన్‌జీ దిగుమతుల్లో 40 శాతానికి పైగా ఖతర్ నుంచి వస్తుండటం తెలిసిందే.

**దాడులు గర్హనీయం: మోదీ**

పశ్చిమాసియా తాజా పరిణామా లపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వెలిబుచ్చా రు. ఈ విషయమై పలువురు దేశాధినేతలతో ఆయన వేర్వేరుగా సంభాషించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ఒమన్ సుల్తాన్ హైతం బిన్ తారిఖ్, మలేసియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం, జోర్డాన్ రాజు అబ్దుల్లా--2తో ఫోన్‌లో మాట్లాడారు. పశ్చిమాసియాలో తాజా పరిస్థితులను గురించి వారితో లోతుగా చర్చించారు. ఇంధన వ్యవస్థలపై దాడులు తీవ్రంగా గర్హనీయమన్నారు. ఉద్రిక్తతలకు తక్షణం తెర దించి శాంతి, సుస్థిరత పాదుగొల్పేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. హార్ముజ్ జలసంధి గుండా సురక్షిత నౌకాయాన్ని తక్షణం పునరుద్ధరించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. వీటన్నింటికీ దౌత్యం, మధ్యవర్తిత్వమే మార్గాలని స్పష్టం చేశారు. ఆ దిశగా జరిగే ప్రయత్నాలకు భారత్ అన్నివిధాలా మద్దతుగా నిలుస్తుందని మోదీ స్పష్టం చేశారు. అధినేతలతో చర్చలు ఫలప్రదంగా సాగినట్టు ఎక్స్ పోస్టుల్లో ఆయన వెల్లడించారు. పశ్చిమాసియా విషయమై ఆందోళనలతో వారంతా ఏకీభవించినట్టు తెలిపారు.

## అందంగా కనిపించేందుకు ఏ రంగు నెయిల్ పాలిష్ వేసుకోవాలో తెలుసా?



గోళ్లకు రంగు వేసుకోవడం ఒక ఎత్తు. అది మన చేతులకు నప్పేలా చూసుకోవడం మరో ఎత్తు. చాలా సార్లు బ్యూటీ పార్లర్‌లో చూసిన రంగు మన చేతికి వేసుకుంటే అంతగా బాగోదు.. ఎందుకో తెలుసా? మన చర్మ ఛాయకు ఆ రంగు సరిపోకపోవడమే. ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ రిచా శివ్‌హరే చామన ఛాయ ఉన్న మహిళల కోసం నెయిల్ పాలిష్ ఎంపికలో కొన్ని రహస్యాలను వెల్లడించారు. ముఖ్యంగా మీ చేతులు రాయల్ లుక్‌తో మెరిసిపోవాలంటే ఏ రంగులకు ప్రాధాన్యం ఇవ్వాలో తెలిపారు. చాలా మంది మార్కెట్లో దొరికే అనేక కొత్త కొత్త రంగు నెయిల్ పాలిష్‌లను చూసి ఆకర్షితులై వెంటనే కొనేస్తుంటారు. కానీ అవి మన చేతులకు నప్పుతాయా, వేసుకుంటే బాగుంటుందని అని ఏమాత్రం ఆలోచించరు. కానీ పెట్టుకున్న తర్వాత లుక్ అంతగా బాగోలేక బాధ పడుతుంటారు. దీనికి ప్రధాన కారణం మన చర్మ రంగును విస్మరించడమే. అయితే మన చేతుల రంగును బట్టే నెయిల్ పాలిష్ రంగును సెలెక్ట్ చేసుకోవాలని సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యుయెన్సర్ రిచా శివ్‌హరే అభిప్రాయపడ్డారు. చర్మ ఛాయను ఎలివేట్ చేస్తూ గోళ్లకు మంచి మెరుపును ఇస్తాయని.. ఏదైనా పార్టీలకు లేదా నైట్ అవుట్స్‌కు వెళ్లేటప్పుడు ఇటువంటి డార్క్ షేడ్స్ ఎంచుకోవడం వల్ల ఇతరుల దృష్టిని సులభంగా ఆకర్షించవచ్చని తెలిపారు.

# జుట్టు రాలడం తగ్గి బాగా పెరగాలంటే



ఈ రోజుల్లో జుట్టు రాలడం ఒక సాధారణ సమస్యగా మారింది. జీవనశైలి అలవాట్లు, ఒత్తిడి, హార్మోన్ల మార్పులు, హెయిర్ స్టైలింగ్ ఉత్పత్తులు, పోషకాహార లోపాలు, రసాయన చికిత్సలు ఇవన్నీ జుట్టు రాలడం, బలహీనపడటం వంటి సమస్యలకు కారణమవుతున్నాయి. అయితే, కొన్ని సరళమైన, ఆరోగ్యకరమైన అలవాట్లను అవలంబించడం ద్వారా జుట్టు రాలడాన్ని తగ్గించుకోవచ్చని డాక్టర్ ప్రియాంక కురి చెబుతున్నారు. ఆ పూర్తి వివరాలపై ఓ లుక్కేద్దాం. ఈ రోజుల్లో బిజీ లైఫ్‌స్టైల్ కారణంగా జుట్టు రాలడం అనేది ఒక సమస్యగా మారింది. ఒత్తిడి, పోషకాహార లోపం, చెడు జీవనశైలి, పొల్యూషన్ జుట్టు రాలడానికి ప్రధాన కారణాలు. లైఫ్‌స్టైల్‌లో కొన్ని అలవాట్లను మార్చుకోవడం ద్వారా జుట్టు రాలడాన్ని తగ్గించడమే కాకుండా బాగా పెరిగేలా చూసుకోవచ్చు. ముఖ్యంగా పోషకాహారం, ఒత్తిడి తగ్గించుకోవడం, నిద్ర, స్కాల్ప్ ఆరోగ్యంపై దృష్టి పెట్టడం ద్వారా జుట్టు రాలడం తగ్గడమే కాకుండా మంచి పెరుగుదలను ప్రోత్సహించవచ్చని డాక్టర్ ప్రియాంక కురి, కన్సల్టెంట్ - డెర్మటాలజీ, ఆస్టర్ వైట్‌ఫీల్డ్ హాస్పిటల్ తెలిపారు. ఆ పూర్తి వివరాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం.


**జుట్టుకు అసలైన బలం పోషకాహారం**

జుప్రోటీన్: జుట్టు కెరాటిన్ అనే ప్రోటీన్‌తో తయారవుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే గుడ్లు, పప్పు ధాన్యాలు, పాలు, బాదం, వాల్‌నట్స్ వంటి నట్స్ వంటివి డైట్‌లో చేర్చుకోవాలి. ఐరన్: శరీరంతో పాటు జుట్టుకు అవసరమైన పోషకాల్లో ఐరన్ ఒకటి. ఐరన్ లోపం వల్ల జుట్టు పల్చబడి రాలిపోతుంది. పాలకూర, బీట్‌రూట్, ఖర్జూరం వంటివి తింటే ఐరన్ పెరుగుతుంది. బయోటిన్: జుట్టు పెరుగుదలకు బయోటిన్ చాలా అవసరం. ఇది జుట్టును బలోపేతం చేసే కెరాటిన్ ప్రోటీన్ ఉత్పత్తిని పెంచడానికి సాయపడుతుంది ఈ లోపాన్ని అధిగమించడానికి ఆకుకూరలు, గింజలు, చిలగడదుంపలు వంటివి తినాలి. జింక్: జుట్టు రాలడానికి జింక్ లోపం కూడా ఒక కారణం. అందుకే జింక్ లోపాన్ని నివారించడానికి ఆహారంలో మాంసం, గుమ్మడి గింజలు, చీజ్, జీడిపప్పులు వంటి వాటిని చేర్చుకోవాలి. ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు: ఇవి జుట్టుకు కావాల్సినంత తేమను అందిస్తాయి. అంతేకాకుండా జుట్టును బలోపేతం చేసే ఆరోగ్యకరమైన కొవ్వులు. ఇవి జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. వీటి కోసం చేపలు, అవిసె గింజలు, వాల్‌నట్‌ల్ని తినండి. విటమిన్ ఇ, విటమిన్ సి: విటమిన్ ఇ జుట్టు మూలాల్ని బలపరుస్తుంది. జుట్టు పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఆహారంలో గింజలు, నట్స్, పాలకూరను చేర్చుకోండి. విటమిన్ సి ఐరన్ శోషణకు సాయపడుతుంది. కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. సిట్రస్ పండ్లు, బెర్రీలు, బ్రకోలీలో విటమిన్ సి పుష్కలంగా లభిస్తుంది.

**ఒత్తిడి తగ్గించుకోవడం, తగినంత నిద్ర**

ఈ రోజుల్లో వర్క్ లైఫ్‌స్టైల్ కారణంగా చాలా మంది మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మానసిక ఒత్తిడి నేరుగా జుట్టుపై ప్రభావం చూపుతుంది. అందుకే ఒత్తిడిని తగ్గించుకోవాలి. ఒత్తిడి నిర్వహణ: ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా, ధ్యానం లేదా ప్రతిరోజూ వ్యాయామం చేయడం వల్ల ఒత్తిడి తగ్గి జుట్టు పెరుగుదల మెరుగుపడుతుంది. లేదంటే మీకు ఇష్టమైన పనుల ద్వారా కూడా ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. తగినంత నిద్ర: ఈ రోజుల్లో చాలా మంది ఒత్తిడి వల్ల నిద్రలేమి సమస్యను ఎదుర్కొంటున్నారు. అయితే, రోజు ఏడు నుంచి ఎనిమిది గంటల గాఢ నిద్ర అవసరం.

# కిడ్నీ క్యాన్సర్ ఉంటే కనిపించే లక్షణాలు నిర్లక్ష్యం చేయొద్దంటున్న డాక్టర్



చాలా మంది కిడ్నీకి సంబంధించిన వ్యాధుల్ని, మూత్రపిండాల్లో రాళ్లు వంటి సమస్యల్ని విస్మరిస్తారు. కానీ, ఈ లక్షణాలు కొన్నిసార్లు మూత్రపిండాల క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్యకి సంకేతాలు కావచ్చు. ఏదైనా అసాధారణ కిడ్నీ సంబంధిత సమస్యను తేలికగా తీసుకోకూడదు. సకాలంలో పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్ శశాంక్ ఎం ఎస్ ప్రకారం కిడ్నీ క్యాన్సర్ తరచుగా ప్రారంభదశలో ఎటువంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా డెవలప్ అవుతుంది. సాధారణంగా వయసు పెరిగే కొద్దీ కిడ్నీల ఫిల్టర్ సామర్థ్యం క్రమంగా తగ్గుతుంది. మానవ శరీరంలో మూత్రపిండాలు ఒక ప్రధాన అవయవం. రక్తాన్ని ఫిల్టర్ చేసి టాక్సిన్లను, యూరియా, మూత్రం ద్వారా అదనపు ద్రవాన్ని తొలగిస్తాయి. శరీరంలో సోడియం, పొటాషియం, ఇతర ఎలక్ట్రోలైట్ల సమతులత్యను కాపాడుకోవడంలో ఇవి కీలక పాత్రను పోషిస్తాయి. ఈ రోజుల్లో కిడ్నీకి సంబంధించిన వ్యాధులు పెరిగిపోతున్నాయి. అందులో కిడ్నీ క్యాన్సర్ ఒకటి. 'డ్నీ క్యాన్సర్ ప్రారంభంలో మూత్రంలో రక్తం, అలసట, తీవ్రమైన నొప్పితో పాటు కొన్ని లక్షణాలు కనిపిస్తాయని డాక్టర్ శశాంక్ ఎం ఎస్, కన్సల్టెంట్ - యూరాలజీ అండ్ మూత్రపిండ మార్పిడి, ఆస్టర్ జవీ× హాస్పిటల్, బెంగళూరు వివరించారు. లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం. ట్రంప్ ఒక్క ప్రకటనతో బంగారం ధరలకు రెక్కలు.. రూ.10 వేలు పెరిగిన వెండి.. ఈరోజు రేట్లు ఇవే కిడ్నీలు శరీరం లోపలి భాగంలో ఉంటాయి. దీంతో క్యాన్సర్ ప్రారంభ దశలో వచ్చే చిన్న గడ్డల్ని గుర్తించడం కష్టం. అందుకే చాలా మంది దీనిని నిర్లక్ష్యం చేస్తుంటారు. మూత్రపిండాల క్యాన్సర్ తరచుగా ప్రారంభ దశలో ఎటువంటి స్పష్టమైన లక్షణాలు లేకుండా అభివృద్ధి చెందుతుంది. దీనిని రీనల్ సెల్ కార్సినోమా అని కూడా పిలుస్తారు. అయితే ప్రారంభదశలో మూత్రంలో రక్తం, అలసట, బలహీనత, తీవ్రమైన నడుము నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి.

**మూత్రంలో రక్తం**

ఏదైనా మూత్రపిండ సంబంధిత సమస్య మొదట మూత్రంలో కనిపించవచ్చు. మూత్రం రంగు సాధారణ పసుపు నుంచి గులాబీ, ఎరుపు లేదా గోధుమ రంగులోకి మారితే, దానిని నిర్లక్ష్యం చేయకూడదు. ఇది అత్యంత సాధారణ లక్షణం. మూత్రం అప్పుడప్పుడు కోలా రంగులో కనిపిస్తుంది. కొన్నిసార్లు ఈ మార్పు నొప్పి లేకుండా సంభవించవచ్చు. కానీ ఇది కిడ్నీ క్యాన్సర్‌తో సహా తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. అలాంటి పరిస్థితుల్లో వైద్యుణ్ని సంప్రదించడం చాలా ముఖ్యం.

**దీర్ఘకాలిక నడుము నొప్పి**

నడుము కింది భాగంలో లేదా పక్కటెముకల కింద ఒక వైపు నిరంతరం నొప్పి ఉంటుంది. నొప్పి ఎక్కువసేపు కొనసాగితే.. విశ్రాంతి లేదా మందులతో తగ్గకపోతే అది సాధారణ కండరాల నొప్పి కాకపోవచ్చు. ముఖ్యంగా నొప్పి ఎటువంటి గాయం లేదా శారీరక శ్రమ లేకుండా ప్రారంభమైతే దానిని తీవ్రంగా పరిగణించాలి. నిరంత నొప్పి కిడ్నీ సమస్యకు సంకేతం కావచ్చు. పరిస్థితి దిగజారడానికి ముందు సరైన రోగ నిర్ధారణ, చికిత్స కోసం వైద్యుణ్ని సంప్రదించండి.

**ఉన్నట్టుండి బరువు తగ్గడం**

ఎటువంటి కారణం లేకుండా అంటే డైటింగ్ చేయకపోయినా.. వ్యాయాం చేయకపోయినా ఉన్నట్టుండి వేగంగా బరువు తగ్గితే అది సాధారణ మార్పు ఏ మాత్రం కాదు. వివరించలేని విధంగా బరువు తగ్గడం అనేది అంతర్లీన సమస్యకు సంకేతం కావచ్చు. చాలా సందర్భాల్లో ఇది కిడ్నీలు లేదా ఇతర రకాల క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్యానికి హెచ్చరిక సంకేతం కూడా కావచ్చు. అటువంటి లక్షణాలు కనిపిస్తే వీలైనంత త్వరగా సంబంధిత వైద్యుణ్ని సంప్రదించడం చాలా ముఖ్యం.

**నిరంతర అలసట**

ఎక్కువ పని చేయకుండా మీరు చాలా కాలం పాటు అలసిపోయినట్లు అనిపిస్తే, విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా శక్తి తిరిగి రాకపోతే, అది కేవలం ఒక సాధారణ బలహీనత కాకపోవచ్చు. నిరంతర అలసట తీవ్రమైన అంతర్లీన సమస్యను సూచిస్తుంది. సాధారణ కార్యకలాపాల సమయంలో కూడా శరీరం త్వరగా అలసిపోవడం ప్రారంభించినప్పుడు, ఏదైనా అంతర్లీన అనారోగ్యాన్ని గుర్తించడానికి దానిని విస్మరించడం కంటే వైద్య సహాయం తీసుకోవడం మంచిది.

**వాపు లేదా ఉబ్బరం**

పొట్ట , కాళ్ళు, చీలమండలు లేదా కళ్ళ చుట్టూ ఆకస్మిక వాపు ద్రవ అసమతుల్యతకు సంకేతం కావచ్చు. మూత్రపిండాల వైఫల్యం శరీరంలో అదనపు నీరు పేరుకుపోవడానికి కారణమవుతుంది. ఇది వాపుకు దారితీస్తుంది. ఇలాంటి పరిస్థితిని సాధారణమని భావించి విస్మరించకూడదు. వాపు కొనసాగితే లేదా పెరుగుతుంటే, కారణాన్ని గుర్తించడానికి వెంటనే నిపుణుల్ని సంప్రదించడం చాలా ముఖ్యం.

**ఈ లక్షణాలు కూడా కనిపించవచ్చు**

రాత్రిపూట లేదా అధికంగా మూత్ర విసర్జన చేయడం: రాత్రిపూట తరచుగా టాయిలెట్‌కి వెళ్లడానికి లేవాల్సి వస్తే ఇది కిడ్నీ క్యాన్సర్‌కి సంకేతం కావచ్చు. మీరు ఉన్నట్టుండి రోజంతా సాధారణం కంటే ఎక్కువగా మూత్ర విసర్జన చేయడం ప్రారంభిస్తే అలర్ట్ అవ్వండి. ముఖ్యంగా ఎక్కువ నీరు తాగకుండా కూడా ఈ సమస్య కొనసాగితే వైద్యుణ్ని సంప్రదించడం మంచిది. రెగ్యులర్‌గా జ్వరం లేదా రాత్రిపూట చెమటలు: ప్రతి రోజూ తేలికపాటి జ్వరం లేదా రాత్రి పూట ఎక్కువగా చెమటలు పడితే ఇది అంతర్లీన ఆరోగ్య సమస్యకు సంకేతం కావచ్చు.

**పాటించాల్సిన జాగ్రత్తలు**

ఆరోగ్యకరమైన అలవాట్లు ఫాలో అయితే కిడ్నీ క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. సరైన బరువు: ఈ రోజుల్లో చాలా మంది ఊబకాయంతో బాధపడుతున్నారు. అలాంటి వారు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ బరువును అదుపులో ఉంచుకోవాలి. ఆహార నియమాలు: పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి సమతుల్య ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 శుక్రవారం 20-3-2026

# ఈద్ ముబారక్

## అందరినీ ఆ అల్లాహ్ చల్లంగా చూడాలి.. మీ పిల్లలు చదువుల్లో నిర్లక్ష్యం చేయకండి

### ముస్లిం సోదర సోదరీ మణులకు విజేత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ కిట్స్ పంపిణీ




**ఖమ్మం(క్రైమ్ మిర్రర్ బ్యూరో ):** రంజాన్ పండుగను పురస్కరించుకొని మీ అందరికీ ఈద్ ముబారక్ శు భాకాంక్షలు తెలుపు తున్నానని విజేత ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ వేల్పుల విజేత అన్నారు. గురువారం ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని రెండవ డివిజన్ పాండురంగాపురంలో జర్నలిస్ట్ జానిపాషా నివాసంలో విజేత ఫౌండేషన్ మహమ్మద్ యూసుఫ్ (ఎన్ఆర్ఐ ఒమన్ ) ఫరేజ్ అహ్మద్ షరీఫ్ ఎన్ఆర్ఐ (గట్టయ్య సెంటర్ ) ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ కిట్స్ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ వేల్పుల విజేత మాట్లాడుతూ 30 రోజుల కఠోర ఉపవాస దీక్షల అనంతరం ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పండుగను ఆనందోత్సవాల మధ్య మీరంతా జరుపుకోవాలని ఆ అల్లాహ్ అందరినీ చల్లగా చూడాలని ఆమె ఆకాంక్షించారు. మానవుని దయనందిత జీవితంలో కష్టసుఖాలు తథ్యమని కష్టాలు వచ్చినప్పుడు ధైర్యంగా ఎదుర్కొని తాము ఎంచుకున్న రంగాలలో ముందుకు వెళ్లాలని అన్నారు. ప్రస్తుత సమాజంలో భర్త వేతనంతో కుటుంబం గడవటం కష్టతరంగా మారిన నేపద్యంలో మహిళలు కూడా ఉద్యోగ ఉపాధి రంగాలలో రాణించే విధంగా ముందుకు సాగాలని ఆమె అన్నారు అదేవిధంగా మీ పిల్లల విద్య అంశంలో ఎక్కడా రాజీ పడొద్దని ప్రభుత్వ అవకాశాలను వినియోగించుకోవాలని ఉన్నత చదువులు చదివించుకుంటేనే మీ పిల్లల భవిష్యత్తుతో పాటు మీకు వారు ఆసరాగా నిలుస్తారని పేర్కొన్నారు. ఫరెజ్ అహ్మద్ షరీఫ్ ( ఎన్ఆర్ఐ ) తరుపున పవిత్ర రంజాన్ సందర్భం లో పేదలకు రంజాన్ తోఫా ( కిట్స్ ) ను అందజేశారు. అందరు సుఖశాంతులతో ఉండాలని పరస్పర సోదర భావంతో అందరు కలిసి మెలిసి ఉండాలని సమాజ శాంతి కోసం తోడ్పాడాలని పేర్కొన్నారు. తొలుత ముస్లిం సోదర సోదరీమణులకు విజేత ఫౌండేషన్ ఫరేజ్ అహ్మద్ షరీఫ్ మహమ్మద్ యూసుఫ్ ఎన్ఆర్ఐ ఒమన్ (గట్టయ్య సెంటర్ ) ల ఆధ్వర్యంలో 120 మందికి రంజాన్ కిట్స్ లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె పండుగ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు షేక్ జానీ పాషా నాగస్వామి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలంతా ఆనందోత్సవాలతో జీవించాలి

### రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీజే పీ పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా ఆయనను కలిశారు. శ్రీ పరాభావ నామ సంవత్సర ఉగాధి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఉగాది తెలుగు నూతన సంవత్సరంలో ఆ భగవంతుని ఆశీర్వాదంతో డివిజన్ ప్రజలు అందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మాజీ అధ్యక్షులు అడికే జనార్ధన్, సీనియర్ నాయకులు రావుల భాస్కర్, మన్మోహన్‌రెడ్డి, రామిడి మధుసూధన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, అడికే శివశంకర్, సచిన్‌షిండే, పొప్పట్ మానే, విఠల్ షిండే తదితరులు పాల్గొన్నారు.

## మణికొండ బీరప్ప మల్లన్న దేవాలయంలో ఉగాది పచ్చడి, పంచాంగ పఠనం



**గండిపేట(క్రైం మిర్రర్):** మణికొండ శ్రీశ్రీ బీరప్ప మల్లన్న స్వామి దేవాలయంలో శ్రీ పరభావ నామ నూతన సంవత్సర ఉగాధి పచ్చడి కార్యక్రమం, పంచాంగం పఠనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం చైర్మన్ జైహింద్‌రావు, అధ్యక్షుడు సి.బీరప్ప, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, కోశాధికారి గణేష్, కమిటీ సభ్యులు ఈ.యాదయ్య, బి.శ్రీరాములు, బి.శ్రీరాములు(చిన్న), బి.శంకర్, డి.కృష్ణ, జె.సిద్ధప్ప, డి.లక్ష్మణ్, జె.భిక్షపతి, ఆంజనేయులు, సి.జంంగయ్య, డి.కిట్టు, బి.బీరప్ప, బి.శ్రీశైలం, కె.బీరప్ప, సురేష్, బి.రాఘవేందర్, హరికృష్ణ, చంద్రప్రకాష్, మల్లేష్, శివకుమార్, బి.రాజు, శివశంకత్ తదితరులు పాల్గొన్నారు.

## బాబుల్ రెడ్డి నగర్‌లో ఏప్రిల్ 19న హిందూ సమ్మేళనం



**గండిపేట్: ( క్రైమ్ మిర్రర్ ):** బాబుల్ రెడ్డి నగర్‌లో వచ్చే నెల ఏప్రిల్ 19వ తేదీన భారీ ఎత్తున "హిందూ సమ్మేళనం" నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు చేడం వెంకటరమణ గుప్తా, పల్లపు జగన్ మల్లేష్ మాట్లాడుతూ హిందూ సమాజ ఐక్యత, సంప్రదాయాల పరిరక్షణ లక్ష్యంగా ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమ్మేళనం బొడ్డురాయి చౌరస్తాలో నిర్వహించబడుతుంది. కమిటీ అధ్యక్షుడిగా వలకొండా విజయకుమార్, ప్రధాన కార్యదర్శిగా సిద్రాల సంతోష్, కోశాధికారిగా చెన్న శ్రీరామ్ నియమితులయ్యారు. ఇటీవల నిర్వహించిన సన్నాహక సమావేశంలో గోపాల్ నాయక్, కల్యాణి సత్యనారాయణ, సాయిరాం, సెంట్రింగ్ శంకర్, రామకృష్ణ, శివాజీ, శివరాజ్, ప్రవీణ్ కుమార్ తదితరులను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఘనవిజయం చేయడానికి ప్రజలు సహకరించాలని నిర్వాహకులు కోరారు.

## తాను నమ్మిన సిద్ధాంతం కోసం ఎర్రజెండాను నమ్మిన కామ్రేడ్ గజ్జల వెంకటయ్య ఆశయాలను కొనసాగిస్తాం

### సీపీఐ ఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను




**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** తిరుమలయపాలెం మండలంలో తాను నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు ఎర్రజెండాను నమ్ముకుని మండలంలో పార్టీ విస్తరణ కోసం ఎనలేని కృషిచేసిన కామ్రేడ్ గజ్జల వెంకటయ్య ఆశయాలు కొనసాగిస్తామని సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను పేర్కొన్నారు గురువారం మండల పరిధిలోని పిండిప్రోలు గ్రామంలో కీర్తిశేషులు అమరజీవి కామ్రేడ్ గజ్జల వెంకటయ్య 30 వర్ధంతిని ఘనంగా నిర్మించారు ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను మాట్లాడుతూ తిరుమలాయపాలెం మండలంలో దొరల భూస్వాముల పెత్తందారీ విధానాలకు వ్యతిరేకంగా గ్రామాల్లో ప్రజానీకాన్ని చైతన్యపరిచి ఐక్యం చేసి పార్టీ విస్తరణ కోసం ఎనలేని కృషి చేసిన మహానీయుడు కామ్రేడ్ గజ్జల వెంకటయ్య అని ఆయన తెలిపారు ఈ సందర్భంగా పిండిప్రోలు గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త మాట్లాడుతూ కామ్రేడ్ వెంకటయ్య పిండిప్రోలు గ్రామంలోనే కాక మండలంలోని 76 గ్రామాల్లో పార్టీ విస్తరణ కోసం ఎనలేని కృషి చేశారని ఫలితంగానే ఈరోజు నేను పిండిప్రోలు గ్రామపంచాయతీ సర్పంచ్ గా గెలుపొందానంటే ఆయన కృషినని ఆమె తెలిపారు భవిష్యత్ తరాల కోసం ఆయన చేసిన కృషిని ప్రజలకు తెలుపుతూ ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని ఆమె తెలిపారు ఆయన త్యాగ ఫలితంగానే నేడు మండలంలో పార్టీ విస్తరణ జరిగిందని ఆమె తెలిపారు ఈ కార్యక్రమం లో కామ్రేడ్ గజ్జల వెంకటయ్య మనవడు గుడివాడ నవీన్ సిపిఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను గజ్జల వెంకటయ్య శిష్యుడు సీనియర్ జర్నలిస్ట్ పప్పుల శ్రీనివాసరావు గ్రామ సర్పంచ్ కామల్ల సువార్త మాజీ సర్పంచ్ అంగడి వీరస్వామి మండల కమిటీ సభ్యులు పప్పుల ప్రసాద్ తుళ్లూరు నాగేశ్వరరావు చామకూరి వీరయ్య కామల్ల వీరభద్రం దొండేటి నిర్మలరావు మల్లెబోయిన యాదగిరి రామిండ్ల సుందరయ్య గోపోజి నాగరాజు గుర్రం అప్పయ్య తదితరులు పాల్గొన్నారు,

## ఉగాది శుభదినాన శంకర్‌పల్లి--వికారాబాద్ నూతన బస్సు సేవ ప్రారంభం




**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రజా రవాణా సదుపాయాల విస్తరణకు సంకేతంగా శంకర్‌పల్లి నుండి వికారాబాద్ వరకు వయా పర్వేద, గంగ్యాడ, పులపల్లి మార్గంలో నూతన బస్సు సేవను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చేవెళ్ల ఇంచార్జ్ పామేనా భీమ్ భరత్ ముఖ్య అతిథిగా హాజరై బస్సును ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సమర్థవంతమైన రవాణా వ్యవస్థ కీలకమని, ఈ కొత్త బస్సు సేవతో పల్లె ప్రజల ప్రయాణ సౌలభ్యం మరింత మెరుగుపడుతుందని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతుల విస్తరణకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్వేద గ్రామ సర్పంచ్ సురేందర్ గౌడ్, ఉప సర్పంచ్ సునీత వెంకట్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు శ్రీనివాస్, విష్ణుకాంత్ రెడ్డి, అనిత, ఆనంద్ గౌడ్, పద్మజ, అనంతయ్య పాల్గొన్నారు. అదేవిధంగా శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు యం.డి. నసీరోద్దీన్, పర్వేద రామాలయ కమిటీ చైర్మన్ అనంత్ రెడ్డి, సుభాన్ రెడ్డి, వెంకటేశం, రాములు, బుచ్చయ్య, లక్ష్మయ్య, విట్టల్, జాంగిర్, నర్సింలు గౌడ్, బిక్షపతి తదితర ప్రముఖులు హాజరయ్యారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ఈ నూతన బస్సు సేవకు విశేష స్పందన లభించింది. ప్రజల రవాణా అవసరాలను తీర్చే దిశగా ఈ సేవ ఒక కీలక మైలురాయిగా నిలవనుందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.



## మైలార్‌దేవ్‌పల్లిలో ఘనంగా ఉగాది ఉత్సవాలు

### పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్



**గండిపేట(క్రైం మిర్రర్):** అత్తాపూర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి, కాటేదాన్ డివిజన్‌లలో ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా దేవాలయాల్లో పంచాంగ పఠన కార్యక్రమాలను చేపట్టారు. కాటేదాన్ శ్రీ బంగారు మైసమ్మ ఆలయంలో పంచాంగ పఠనంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ టి.ప్రేమ్‌దాస్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనుంజయ్, బాస శ్రీనివాస్ నేత, గడ్డం సత్యనారాయణ నేత, పులిజాల వివేకానందా నేత, వెంకటేష్ గౌడ్, గట్టయ్య, రాము నేత, రమేష్ గుప్తా, బండారి యాదగిరి నేత, ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు మహేష్ గౌడ్, కాలనీ వాసులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్నికలలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కౌన్సిలర్

### తన వార్డ్ లో పింఛన్ రాని వారికీ 2 వేలు పింఛన్ ఇచ్చిన కౌన్సిలర్ బానూరు కృష్ణ



**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి :** శంకర్ పల్లి మున్సిపల్ పరిధిలోని 5 వార్డ్ కౌన్సిలర్ బానూరు కృష్ణ ఎన్నికలలో పింఛన్ రాని వారికీ వాళ్లకు ప్రభుత్వం పింఛన్ ఇచ్చే వరకు నేను ఇస్తానని కౌన్సిలర్ బానూరు కృష్ణ ఎన్నికలలో ఇచ్చిన హామీ ని ఉగాది పండుగ సందర్బంగా పింఛన్ కు అర్హత ఉండి పింఛన్ రాని వారికీ తన స్వంత డబ్బులు 20 మందికి రెండు వేలు చొప్పున ఇచ్చారు, ఈసందర్బంగా కౌన్సిలర్ బానూరు కృష్ణ మాట్లాడుతు వార్డ్ సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇస్తానని అన్నారు, ఇపుడు నేను ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం 20 మందికి పింఛన్ రాని వారికీ పింఛన్ ప్రభుత్వం ఇచ్చే వరకు న స్వంత నిధుల నుండి ఇస్తానని అన్నారు, ఈసందర్బంగా వార్డ్ ప్రజలు కౌన్సిలర్ బానూరు కృష్ణ ను అభినందనలు తెలిపారు

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.